క్లుప్తంగా

జోరుగా అభివృద్ధి పనులు



బీటీరోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న స్థానిక నాయకులు

గుర్ల: మండలంలోని పెనుబర్తిలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారికి సుమారుగా రూ.20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మగుంటి పరమేష్, అంబల్ల చిన్నారావు శనివారం తెలిపారు. సుమారు కిలోమీటర్లు పొడువున గ్రామం మధ్యలో బీటీ రోడ్డు వేసినట్లు చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించారు.

పుస్తక పఠనంపై ఆసక్తి చూపాలి



వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న బంగారునాయుడు

గుర్ల: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి చూపించాలని జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్ బెల్లాన బంగారునాయుడు అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని, నీతికథలు, దేశనాయకుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాలని లైబ్రేరియన్ రామారావుకు సూచించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

గజపతినగరం: గజపతినగరం 33కేవీ ఫీడర్‌తో పాటు దత్తిరాజేరు మండలం కోమటిపల్లి 33కేవీ ఫీడర్ పరిధిలో వార్షిక నిర్వహణ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎస్.కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

నగదు బహూకరణ



హేమంత్‌కు షీల్డ్‌ను బహూకరిస్తున్న సురేష్, తదితరులు

గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ ప్రీమియం లీగ్ పోటీలు రసవత్తంగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన మ్యాచ్‌లో మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన హేమంత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. విజేతలకు పురిటిపెంట గ్రామానికి చెందిన లోచర్ల వెంకట సత్యసాయి సురేష్ రూ.5వేలు నగదు బహూకరించారు.

అధికారులంతా హాజరుకావాలి

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు కచ్చితంగా హాజరుకావాలని ఎంపీడీఓ పి.రామకష్ణ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి సకాలంలో పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. అలాగే ప్రజలు 'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదు చేయాలనుకుంటే 1902 నంబరుకి కాల్ చేసి సమస్యను చెప్పవచ్చన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



గోతులతో నిండిన పాచలవలస రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు నుంచి పాచలవలస గ్రామానికి వెళ్లే తారురోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ రోడ్డు గోతులతో నిండిపోయి అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లామని, వారు సానుకూలంగా స్పందించారని సర్పంచ్ సుమల శ్యామల, వైఎస్సార్‌సీపీ నాయకులు సుమల గోవింద్ తెలిపారు.

ప్లాస్టిక్ అంతం..
మాటలకే పరిమితం..



వినియోగంలో ఉన్న నిషేధిత సింగిల్ యూజ్ పాలిథిన్ కవర్లు



నగరంలో రింగ్‌రోడ్ ప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

- నిషేధం విధించినా నగరంలో యథేచ్ఛగా విక్రయాలు, వినియోగం
- చట్టాలు కఠినంగా ఉన్నా.. అధికారుల ఉదాశీనత
- తూతూమంత్రంగా దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్న వైనం

విజయనగరం: పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ సంచుల విక్రయాలు నగరంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకసారి వాడి పడేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించాయి. వాటిని ఎవరైనా తయారు చేసినా, విక్రయాలు జరిపినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలున్నాయి. అయితే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు డీలర్లు పక్క రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున నిషేధిత పాలిథిన్ కవర్లను తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు అడపాదడపా దాడులు చేసి, జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి.

చట్టం కఠినం..

ప్లాస్టిక్ వ్యర్థాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చట్టం తీసుకువచ్చింది. గతేడాది జులై నుంచి ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, ఫోర్కులు, ట్రేలు, ఇయర్ బడ్స్, బెలూన్స్, ఐస్‌క్రీమ్ స్టిక్స్, స్ట్రాలు, తదితర వస్తువుల తయారీ, రవాణా, వినియోగాన్ని నిషేధించింది. పాలిథిన్ కవర్లలో అతి తక్కువ మందం ఉండే వాటిని వాడరాదని స్పష్టం చేసింది. మొదట్లో 75 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉండగా.. గతేడాది డిసెంబరు 31వ తేదీ నుంచి 120 మైక్రాన్ల కన్నా తక్కువ వాటిని సైతం నిషేధిత జాబితాలో చేర్చింది. 120 మైక్రాన్ల కన్నా ఎక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లను వినియోగించాలన్నా వాటిపై టీఎస్ పీసీబీ ముద్ర ఉండాలని స్పష్టం చేసింది. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులపై గతంలో అధికారులు ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. అయినా పాలిథిన్ బ్యాగులు, ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్లలో విచ్చలవిడిగా లభిస్తున్నాయి.

పట్టుబడితే భారీగా జరిమానాలు..

నిషేధించిన ప్లాస్టిక్ సంబంధిత వస్తువులను తయారు చేసినా, విక్రయించినట్లు పట్టుబడితే భారీగా జరిమానాలు విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటిసారి పట్టుబడితే రూ. లక్ష జరిమానా విధించి వస్తువులను స్వాధీనం చేసుకోవాలి. అదే వ్యాపారి రెండోసారి పట్టుబడితే రూ.2 లక్షల జరిమానాతో పాటు ట్రేడ్ లైసెన్సు రద్దు చేసి దుకాణాన్ని మూసివేయాల్సి ఉంటుంది. వ్యక్తులు వాటిని వినియోగిస్తూ దొరికితే రూ.500 జరిమానా చెల్లించాలి. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను మురుగు కాలువల్లో, చెరువుల్లో పడేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చితే రూ. 25 వేల జరిమానా విధించే అధికారం అధికారులకు ఉంది. ఈ కార్యాచరణను పకడ్బందీగా అమలు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినా.. ప్లాస్టిక్ విక్రయాలను అరికట్టడంలో విఫలమవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతి రద్దు చేస్తాం

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించరాదని వ్యాపారులకు తెలియజేశాం. ఆకస్మిక తనిఖీలు చేసి భారీగా జరిమానాలు విధిస్తున్నాం. ఇప్పటికే చాలాసార్లు దాడులు నిర్వహించి నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకుని, జరిమానా విధించాం. రెండోసారి పట్టుబడితే వ్యాపార అనుమతులను రద్దు చేస్తాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్









యోగాతో
ఆరోగ్యం

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా, గీతం విశ్వవిద్యాలయం సౌజన్యంతో యోగా ఆవశ్యకతపై శనివారం స్థానిక కోట వద్ద నిర్వహించిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగా చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సంస్థలు, పాఠశాలల నుంచి సుమారు వెయ్యిమంది యోగాసనాలు వేశారు. – విజయనగరం

పరిపాలన అనుమతులు ఇప్పించండి



మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, న్యాయవాదులు

- మంత్రి బొత్సను కోరిన బార్ అసోసియేషన్

చీపురుపల్లి: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు ఇప్పించాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణను చీపురుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోరారు. ఈ మేరకు శనివారం చీపురుపల్లి వచ్చిన మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీపురుపల్లిలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణం నిర్మాణానికి రూ.4.6 కోట్లు నిధులను కేటాయిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ఈ నిధులు విడుదలకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికశాఖ పరిపాలన అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. తక్షణమే ఆర్థికశాఖతో మాట్లాడి పరిపాలన అనుమతులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.నాగభూషణరావు, కోశాధికారి కె.సింహాచలం, న్యాయవాదులు బి.రాజరత్నంనాయుడు, దాసరి రఘుపతినాయుడు, గోపి తదితరులు ఉన్నారు.

18లోగా రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

బొండపల్లి: రైతుభరోసా పెట్టుబడి సాయం కోసం అర్హులైన కొత్త రైతులు ఆర్‌బీకేల్లో ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. కొత్తగా పాసు పుస్తకాలు పొందిన రైతులు, వివిధ కారణాలతో ఇంతవరకు రైతుభరోసా పొందని రైతులు పూర్తి వివరాలతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ధర్మవరంలో క్రాస్ కంట్రీరన్

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ షటిల్ క్యాంప్‌లో భాగంగా క్రీడాకారులకు శనివారం క్రాస్‌కంట్రీ రన్ నిర్వహించారు. కోచ్ పి.శ్రీరాములు నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీలో 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక సామర్థ్యం పెరుగుతుందని కోచ్ అన్నారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ తగరంపూడి రమణ, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి వెంకటరావు, కోచ్‌లు హారిక, మౌనిక, యోగా కోచ్ కళ్యాణి తదితరులు హాజరయ్యారు.

పేదింటి ఆడపిల్లకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కె.చంద్రరావు

గజపతినగరం: మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన జి.అప్పారావు కుమార్తె వివాహ నిమిత్తం ఎన్‌జీటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకల చంద్రరావు రూ.10వేలు నగదు అందజేశారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దివంగత కనకల రామునాయుడు జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని శుక్రవారం రాత్రి పెళ్లికుమార్తెకు అందజేశారు. భూదేవిపేట గ్రామంలో ఎస్సీ, రజక, మంగలి కులాలకు చెందిన ఆడపిల్లలకు వారి వివాహ సమయంలో రామునాయుడు జ్ఞాపకార్థం ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



ఎస్.కోట దేవీ జంక్షన్‌లో కాంగ్రెస్ నేతల సంబరాలు

శృంగవరపుకోట: కర్టాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు. స్థానిక దేవీ జంక్షన్‌లో శనివారం సాయంత్రం బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు జి.బంగారునాయుడు మాట్లాడుతూ కర్టాటకలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధించి కొత్త ఊపునిచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా మారుతున్న రాజకీయ వాతావరణానికి ఇది నాంది అని, బీజేపీ మతం ముసుగులో చేస్తున్న అరాచకాలు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలను దేశం గమనిస్తోందన్నారు. 2024లో దేశ ప్రజలు బీజేపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మణిబాబు, హెచ్.నానాజీ, శ్రీనివాసరావు, మెంటాడ అప్పారావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు రవాణా చేస్తే చర్యలు

- ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాలు రవాణా చేస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి. మధుకుమార్ అన్నారు. పట్టణంలోని వై జంక్షన్ వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, తదితర డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాలు రవాణా జరగకుండా నిరోధించేందుకు వాహన తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. తనిఖీలకు వాహనదారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా చేయడం వలన కలిగే అనర్థాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి వంటివి రవాణా చేస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



బీసీ కాలనీ రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజు, తదితరులు

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజు

విజయనగరం రూరల్: పంచాయతీ పాలకవర్గమంతా సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విజయనగరం మండలంలోని సారిక గ్రామాన్ని డీపీఓ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ, సర్పంచ్, వార్డు సభ్యులకు మధ్య ఏమైనా సమస్యలుంటే సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు, తదితర వాటిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, పంచాయతీ విస్తరణాధికారి తిరుపతినాయుడు, సర్పంచ్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన మద్దిల శివ జ్ఞాపకార్థం ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పెద్దలు, 2010–11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చినబూరాడపేట గ్రామ సచివాలయంలో జేఎల్ఎంగా విధులు నిర్వహిస్తూ ఈ నెల 5న శివ మృతి చెందిన విషయం తెలిసిందే. 2003 నుంచి ఇప్పటివరకు శివ 17 సార్లు రక్తదానం చేశారని స్నేహితులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన జ్ఞాపకార్థం రావిచెట్టు వీధిలోని నల్లి సూరిబాబు కళావేదిక వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గడపగడపకు సంక్షేమం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జగనన్నకు మీ ఆశీస్సులు అందించి తోడుగా నిలవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. వల్లంపూడి గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగ బలహీన వర్గాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి వంటి ఎన్నో పథకాలను మహిళలకు అందిస్తున్నారన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని భావించి కోట్లాది రూపాయల వ్యయంతో నాడు-నేడు కింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. జల జీవన్ మిషన్ కింద గ్రామాల్లో ప్రతీ ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ఎంపీటీసీ ఎస్.లక్ష్మి, ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరీ, బానాది సర్పంచ్ కర్రి యశోద, శ్రీరామ్మూర్తి, బీల సతీష్, బొడ్డు శ్రీను, బంగారయ్య, ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవనాలు ప్రారంభం



కళాశాల భవనాలు ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఆవరణలో అప్‌గ్రేడెడ్ జూనియర్ కళాశాల భవనాలను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.1.10 కోట్లతో కేజీబీవీ జూనియర్ కళాశాలకు సొంత భవనాలు నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కేజీబీవీల్లో ఖాళీలన్నీ భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, డీఈఓ లింగేశ్వరరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.